దేని తరువాత ఏ పని చేస్తే టైమ్ సేవ్ అవుతుంది అవన్నీ తెల్సుకుంటూ అందరి అవసరాలు చూడాలి.


సరిసరి ఉద్యోగంలో అలిసిపోవట్లేదు? నేటి ఆర్థిక అవసరాలు. ఉద్యోగానికి పురికొల్పుతున్నాయి. రెంటినీ బ్యాలెన్స్ చేసుకుంటూ గడపడానికి నైపుణ్యం కావాలి. అది అందరకూ సాధ్యం కాదు. అయినా ఈమధ్య చాలా మంది మహిళలు స్వయం ఉపాధి పథకాలు ఎన్నుకుంటున్నారు. ఏమైనా దేనికదే ప్రత్యేకతలు కలిగినవి. ఇంటిని స్వర్గమయం చేయటాన్కి, ఆఫీసులో సక్రమంగా పనిచేయటాన్కి, రెండిటినీ సమన్వయం చేయాలే కానీ ఒకదానిపై ఒక ప్రభావం పడకూడదు. నాకు రోజూ నువ్వే గుర్తొస్తున్నావు వదినా! నీతో ఈ విషయం చెప్పాలి, రావాలి అంటే కుదరట్లేదు. ఈరోజు నీతో మనసు విప్పి మాట్లాడాక హ్యాపీగా ఉంది. నాకూ అంతే. సర్లే ఉపన్యాసాలు ఇచ్చి అలిసిపోయాం కానీ రా ఈరోజు నీకు ఇష్టమైన వంటకాలు అన్నీ వండుతాను. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తిందాం" అంటూ నీరజ చెయ్యి పుచ్చుకుని లోపలికి నడిచింది విమల.

**-లక్కరాజు శ్రీదేవి**

(నరసాపురం)

★ ★ ★

# వృథా



**బ**స్సు ఒక్క కుదుపుతో ఆగగానే నాకు నిద్రలోంచి మెలకువ వచ్చింది. ఆవలిస్తూ బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాను. బయటకు తొంగి చూసాను. మా బస్సు ఒక పెద్ద హోటల్ ముందు ఉంది.

"దయచేసి అందరూ కాస్త రిఫ్రెష్ అయి భోజనాలు చేయండి. అందుకోసమే ఇక్కడ బస్సు ఆగింది" అంటూ ఇంగ్లీషులో ప్రకటన వెలువడింది. ఒక్కొక్కరూ మెల్లగా బస్సు దిగడం ప్రారంభించారు. నేను అడుగులో అడుగు వేసుకుంటూ హోటల్ వైపు దారి తీసాను. చుట్టుపక్కల పరిసరాలను పరిశీలిస్తూ హోటల్‌లోకి ప్రవేశించాను.

కాస్త రిఫ్రెష్ అయి కావలసిన పదార్థాలకి ఆర్డరు ఇచ్చి ఖరీదైన కుర్చీలో కూచున్నాను. నిజానికి నేనేమీ పెద్దగా అలిసిపోలేదు. ముంబాయి నుంచి హైదరాబాద్ వరకూ విమానంలో వచ్చాను. అక్కడి నుంచి ఏ.సి.బస్సులో బయలుదేరాను.

సహజ వనరులు మరియు వాటిని రక్షించుకోవడం ఎలా? అనే అంశంపై అమెరికాలో జరిగిన ఒక అంతర్జాతీయ సదస్సులో పాల్గొని రెండు రోజుల క్రితమే ముంబాయి వచ్చాను. దాదాపు వంద దేశాల నుంచి ప్రతినిధులు ఆ సదస్సుకు హాజరయ్యారు. రేపు మన రాష్ట్రంలోని ఒక మారు మూల ప్రాంతంలో ఉన్న రీసెర్చ్ సెంటర్‌లో మీటింగ్ ఉంది. దానికోసం దాదాపు ఇరవయి మంది శాస్త్రజ్ఞులం బస్సులో బయలుదేరాము. అమెరికా సదస్సులో అనేక విషయాలు చర్చించాము. ముఖ్యంగా పెట్రోలియం, పెట్రోలియం ఉత్పత్తుల గురించి సుదీర్ఘ చర్చ జరిగింది. పెట్రోలియం ఉత్పత్తులను ఏ విధంగా కాపాడుకోవాలి, భవిష్యత్ తరాలకి వాటిని ఏ విధంగా భద్రంగా ఉంచాలి అనే అంశంపై అనేకమంది శాస్త్రజ్ఞులు తమ అభిప్రాయాలని వెల్లడించారు. మన దేశం నుంచి ప్రత్యేక ప్రతినిధిగా వెళ్ళిన నాకు ఉపన్యాసానికి అవకాశం లభించింది.

నా ఉపన్యాసం సదస్సులోని సభ్యులను మంత్రముగ్ధులను చేసిందనే చెప్పాలి. సహజ వనరులు, భూగోళం మీద ఏ విధంగా తర్వితగతిని తగ్గిపోతున్నాయి, మనం వాటిని ఏ విధంగా కాపాడుకోవాలి, ఏ ఏ ప్రత్యామ్నాయాలను ఏ విధంగా అన్వేషించాలి అనే విషయాలు నా ఉపన్యాసంలో వివరించాను. పెట్రోలు, డీజిలు ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలి, విద్యుచ్ఛక్తి సహజ వాయువులను ఏవిధంగా పొదుపు చేసుకోవచ్చు, వంటింట్లో ఇంధన పొదుపు పద్ధతులు మొదలగు విషయాలు సోదాహరణంగా విశ్లేషించి చెప్పాను. నా ఉపన్యాసం అనంతరం కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. అనేకమంది శాస్త్రజ్ఞులు నన్ను వ్యక్తిగతంగా ప్రశంసించారు. సభాధ్యక్షుడు నన్ను ప్రత్యేకంగా కొనియాడిన తీరుకు నేను పులకరించిపోయాను.

నిజానికి నేను చెప్పిన విషయాలు చాలామందికి తెలిసినవే. పెట్రోలు, గ్యాస్, విద్యుచ్ఛక్తి నీరు మొదలగువాటిని గురించి జాగ్రత్తలు తీసుకోం. వృథా చేస్తూంటాం.

వాటి పొదుపునకు తగినంత ప్రాధాన్యత ఇవ్వం. అదీ కాక "ఎవరో చూస్తారులే, ఎవరో చేస్తారులే" అనే మనస్తత్వం మనలో బాగా నాటుకుపోయింది. నేను సదస్సులో ఈ విషయాలు కూడా ప్రస్తావించాను. వాటిపై కూడా విస్తృతంగా మాట్లాడాను.

నా ఆలోచనలకి భంగం కలిగిస్తూ, వెయిటర్, నేను ఆర్డర్ చేసిన పదార్థాలు టేబుల్‌పై ఉంచాడు. నేను భోజనం ముగించి, కిళ్ళీ నములుతూ బస్సు దగ్గరికి నడిచాను. అక్కడ నాతో బస్సులో వచ్చిన శాస్త్రజ్ఞులు పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళందరూ కూడా సహజ వనరుల విషయంలో ఎన్నో పరిశోధనలు చేసి పుస్తకాలు, పేపర్లు ప్రచురించిన వాళ్ళు. ఇంకో రకంగా చెప్పాలంటే అందరూ కూడా దిగ్గజాలు, ఎంతో విషయ పరిజ్ఞానమున్న శాస్త్రజ్ఞులు. అంతలో అటుగా పది, పన్నెండు సంవత్సరాల వయసు ఉన్న ఒక అబ్బాయి వచ్చాడు. అతను కట్టుకున్న బట్టలు విపరీతంగా మాసిపోయి, చాలా చోట్ల చిరిగిపోయి అతుకుల బొంతలలా వున్నాయి. జుట్టుకు తైల సంస్కారం లేదు. స్నానం చేసి ఎన్నాళ్ళయిందో. అతను అక్కడ ఉన్న మమ్మల్ని అడుక్కోవడం ప్రారంభించాడు. అతను సహజమైన బాల్యం కోల్పోవడమే కాదు, భావిపౌరుడిగా దేశానికి కూడా ఉపయోగపడే అవకాశం కోల్పోతున్నాడు. దేశానికి ఎంతో నష్టం కలుగుతోంది. ఆ నష్టం నుంచి దేశాన్ని కాపాడడానికి శాస్త్రజ్ఞులు నడుం కట్టాలి. ప్రణాళికలు రూపొందించాలి.

మాలో కొందరు అతనిని అసహ్యించుకుని కసురుకున్నారు. కొందరు విసుక్కున్నారు. అతను దగ్గరకు వస్తే మైలపడిపోతామేమోనని దూరంగా జరిగారు. ఒకరిద్దరు మాత్రం మీదకు వచ్చేస్తాడన్న భయంలో కాబోలు రూపాయో అర్ధో దూరం నుంచీ విసిరారు. ఆ కుర్రాడు దూరంగా వెళ్ళిపోతూంటే మేమంతా రిలీఫ్ ఫీలయ్యాం. అతను పరిగెత్తుకుంటూ వెళ్ళి అక్కడకు సమీపంలో ఉన్న వీధి కుళాయిని కట్టేసి, మరలా అడుక్కోవడంలో నిమగ్నమైపోయాడు. ఆ కుళాయిలోని నీళ్ళు ధారగా పడి వృథా అవుతాయి. అతను దానిని కట్టేసి తన పనిలో పడిపోయాడు. నేను ఆ కుళాయిని చాలాసేపు క్రితమే గమనించాను.

నా వీపున ఎవరో కొరడాతో చళ్ళున చరచినట్లయింది. గూబగుయ్యి మనిపించినట్లయింది. అప్రయత్నంగానే చెంప నిమురుకున్నాను.

కళ్ళెదుటే వృథాగా నీరు పోతూ ఉంటే, కుళాయి కట్టాలనే కనీస జ్ఞానం, ఆ దిశగా కనీస ప్రయత్నం చేయాలనే ఆలోచన లోపించిన నేను, అంత దూరం వెళ్ళి సహజ వనరుల పరిరక్షణ మీద పెద్ద ఉపన్యాసం ఇవ్వడం, ఉత్త వృథా అనిపించింది. కుళాయి కట్టేసి, ఇంకొకళ్ళని యాచించడానికి ముందుకుపోతున్న ఆ కుర్రాడి మొహంలోకి చూసే ధైర్యం లేక సిగ్గుతో తలవంచుకున్నాను.

**-ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్** (కాకినాడ)